సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 31 । మార్చి । 2025



ఎండలో జర భద్రం
రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



హత్య కేసులో నిందితుడి అరెస్టు
ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో వృద్ధురాలి హత్య, దోపిడీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో



మృతదేహంతో ఆందోళన
మద్యం దుకాణ ఆవరణలో వ్యక్తి మృతిచెందిన ఘటనలో మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. 8లో

న్యూస్‌రీల్

సంస్కృతికి చిహ్నం ఉగాది



శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సత్కారాలు అందుకున్న గ్రహీతలు

భీమవరం: తెలుగు జాతికి శోభ **ఉగాది వేడుక** అని, సంస్కృతి, సంప్రదాయాల**కు పండుగలు** చిహ్నాలని కలెక్టర్ చదలవాడ **నాగరాణి,** ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు **అన్నారు.** భీమవరం భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మావుళ్లమ్మ దేవస్థానం వరకు శోభాయాత్ర నిర్వహించారు. 40 ఏళ్లుగా ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, 60 మందికి ఉగాది పురస్కారాలు, 50 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించినట్టు నిర్వహణ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. మెజీషియన్ వి.రఘుకు రూ.2.50 లక్షలతో సువర్ణ గంటా కంకణాన్ని అందించి సత్కరించారు. రాజ్యసభ మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, డీఎస్పీ జయసూర్య, భానునాయక్, ఎస్టీఓ అల్లూరి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవాలు



గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మవారు

ద్వారకాతిరుమల : చినవెంకన్న దేవస్థానానికి ఉపాలయం, క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 5 లక్షల గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, కుంకుమార్చనలు జరిగాయి.

జూమ్ మీటింగ్‌లో ధూమపానం
శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు



ధూమపానం చేస్తున్న సోమేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రయ్య నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ధూమపానం చేస్తూ పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు అధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శనివారం సాయంత్రం అడిషనల్ కమిషనర్ చంద్రయ్య జూమ్ మీటింగ్ నిర్వహించారు. కండ్రిగగూడెం 16వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు సిగరెట్ కాలుస్తూ జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఇది చర్చనీయాంశం కావడంతో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఇన్‌స్పెక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీ చంద్రయ్యను ఆదేశించారు. ఈ మేరకు ఏసీ చంద్రయ్య షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై నగర వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారి ఎదుటే కింది స్థాయి ఉద్యోగి ఇలా ప్రవర్తించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన ఉద్యోగులు వేలెత్తి చూపించే పనులు చేయడం సిగ్గు చేటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి ప్రభుత్వంలో కార్మికులకు దగా

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను దగా చేస్తోందని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు విమర్శించారు. హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ 15వ వార్షిక సమావేశం అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకట్రావు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాలకులు మళ్లించిన బోర్డు నిధులను తిరిగి జమ చేసి కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. రాష్ట్రంలో 38 లక్షల మంది భవన నిర్మాణ రంగ కార్మికులు ఉన్నారన్నారు. యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రూ.కోటి నిధులు జమ చేస్తాననే హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చిందీ లేనిదీ తెలియడం లేదన్నారు.

కొల్లేరు.. కన్నీరు

తడారి.. ఎడారి
- నీరు లేక నెర్రలు తీస్తున్న సరస్సు
- వలస పక్షులకు తాగునీటి కష్టాలు
- అక్రమ చెరువులతో పారని నీరు
- ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు నిలుపుదల

కైకలూరు: కొల్లేరు చుక్క నీరు లేక కన్నీరు పెడుతోంది. పచ్చని వచ్చిక బయళ్లు, పక్షుల కిలకిల రావాలతో అలరారే సరస్సు ఏడారిని తలపిస్తోంది. సంతానోత్పత్తి కోసం వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న వలస పక్షులు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఎగువన సముద్రం నుంచి చొచ్చుకొస్తున్న ఉప్పునీటితో కొల్లేరు భూములు చౌడబారుతున్నాయి. పరిస్థితి ఇంతలా ఉన్నా కొల్లేరు నీటి కష్టాలు తీర్చే రెగ్యులేటర్ల నిర్మాణాల ఊసే కూటమి ప్రభుత్వం ఎత్తడం లేదు.

77,138 ఎకరాల్లో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 77,138 ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. మొత్తంగా 122 కొల్లేటి గ్రామాల్లో మూడు లక్షల మందికి పైగా ప్రజలు జీవిస్తున్నారు. సరస్సులోకి 67 డ్రెయిన్ల ద్వారా 1.11 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుంది. వీటిలో 12 వేల క్యూసెక్కులు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్తుంది. ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల సరిహద్దుల నుంచి వచ్చే రామిలేరు, బుడమేరు, తమ్మిలేరు వాగులు కొల్లేరుకు ప్రధాన నీటి వనరులు. కేవలం వర్షాకాలంలో మాత్రమే కొల్లేరులో నీరు చేరుతుంది. వాతావరణ మార్పులు కూడా కొల్లేరులో నీటి కొరతకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కొల్లేరుపై పడుతోందని నిపుణులు అంటున్నారు.

అక్రమ చెరువు గట్లతో..

కొల్లేరులోని చిత్తడి నేలలు మత్స్య ఉత్పత్తుల పెరుగుదలకు అనుకూలం. దీంతో కొల్లేరులో ఆక్వా సాగు నానాటికీ విస్తరించింది. ఆక్రమణలు పెరిగాయి. అక్రమార్కులు కొల్లేరుకు నీటిని చేరవేసే డ్రెయిన్లను పూర్తిగా ఆక్రమించారు. పైగా చెరువు గట్లు 10 అడుగులపైగానే ఏర్పాటు చేయడంతో నీరు కిందకు పారని పరిస్థితి. ఇటీవల సుప్రీంకోర్టులో విశ్రాంత ఉద్యోగి మృత్యుంజయరావు ఆక్రమణలను తొలగించాలని పిటిషన్ వేశారు. రాష్ట్ర అటవీ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా కొల్లేరు అభయారణ్యంలో 18 వేల ఎకరాల్లో అక్రమ సాగు జరుగుతున్నట్టు గుర్తించారు. వేలాది ఎకరాల్లోని చెరువుల్లో నీటిని నింపుకోవడంతో దిగువకు నీటిపారుదల స్తంభించి కొల్లేరు సరస్సు బీడుగా మారుతోంది.



మండవల్లి మండలం చినఎడ్లగాడి వంతెన వద్ద నెర్రలిచ్చిన కొల్లేరు

పక్షులకు క'న్నీటి' కష్టాలు

కొల్లేరుకు 189 జాతులకు చెందిన స్వదేశీ, విదేశీ పక్షులు వస్తుంటాయి. ఏటా వేసవిలో నీటి కోసం ఇవి అల్లాడుతున్నాయి. అయితే ఈ ఏడాది ముందుగానే నీటి కొరత ఏర్పడింది. పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేర్గాంచిన కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రంలో నీరు అడుగంటింది. సంతానోత్పత్తి కోసం వలస వచ్చిన వేలాది పక్షులు ఇక్కడ నివసిస్తున్నాయి. సాధారణ రోజుల్లో 7 అడుగులు ఉండాల్సిన పక్షుల విహార కేంద్రం చెరువులో ప్రస్తుతం కేవలం 4 అంగుళాల నీరు మాత్రమే ఉంది. దీంతో వారం రోజులుగా పక్షుల కేంద్రం చెరువులో బోటు షికారును నిలుపుదల చేశారు.



రెగ్యులేటర్ల నిర్మాణం ఎప్పుడో?

కొల్లేరు సరస్సులో నిత్యం నీరు నిల్వ ఉండాలంటే రెగ్యులేటర్లను నిర్మించాలని నాలుగు దశాబ్దాలుగా నిపుణులు సూచిస్తున్నారు. వీటి ద్వారా సముద్రం నుంచి ఆటుపోటుల సమయంలో కొల్లేరుకు చేరే ఉప్పునీటిని అరికట్టవచ్చు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిలో చేప పిల్లలు (ఫింగర్‌లింగ్స్) వేయడం వల్ల కొల్లేరులో సంప్రదాయ మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. ఇందు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెగ్యులేటర్ల నిర్మాణాలకు రూ.452 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న నాయకులు రెగ్యులేటర్ల నిర్మాణంపై మాత్రం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు.

రెగ్యులేటర్లే శరణ్యం



కొల్లేరు సరస్సుకు ఇటీవల విజయవాడ బుడమేరు నుంచి వేలాది క్యూసెక్కుల నీరు చేరింది. ఆ నీరంతా సమీపంలోని సముద్రంలోకి వెళ్లింది. ఈ క్రమంలో రెగ్యులేటర్లను నిర్మిస్తే ఎగువ నుంచి చేరే నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి రెగ్యులేటర్లు నిర్మించాలి.

– జయమంగళ కాసులు, సర్పంచ్, పెంచికలమర్రు, కైకలూరు మండలం

కొల్లేరు రక్షణ అందరి బాధ్యత



కొల్లేరు అభయారణ్యం పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలి. ఏటా కొల్లేరు నీరు లేక ఎండిపోతుంది. ఈ ప్రభావం కొల్లేరులో జీవించే ప్రాణుల మనుగడపై పడింది. పక్షులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు నీటి వనరులను పెంచాలి. కొల్లేరు సరస్సు, సముద్రానికి మధ్య రెగ్యులేటర్లు నిర్మించాలి.

– ఎల్‌ఎస్ భాస్కరరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మండవల్లి

ఉగాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం: శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో పురోగమించి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆకాంక్షించారు. ఆదివారం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ముందుగా కలెక్టర్ నాగరాణి తదితరులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలంతా మంచి, చెడులను సమానంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ అధికారులు జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపాలని ఆకాంక్షించారు.



భీమవరంలో ఉగాది సంబరాల్లో సన్మాన గ్రహీతలతో కలెక్టర్ నాగరాణి

పంచాంగ శ్రవణం.. కవి సమ్మేళనం

ఉగాది వేడుకల్లో ఈమని రామచంద్రస్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. భీమవరానికి చెందిన కవులు డి.రామనాగేశ్వర రావు, పంపన సాయిబాబు, చిర్రావూరి లక్ష్మీనారాయణ, కాళ్లకూరి శర్మ కవి సమ్మేళనంతో ఆకట్టుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు అలరించాయి. పలువురు కవులు, కళాకారులు, సంఘ సేవలను కలెక్టర్ నాగరాణి శాలువాతో సత్కరించి మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా నీటి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ రాజు, జిల్లా దేవదాయశాఖ అధికారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



శాంతి, సహనానికి ప్రతీకగా నిలిచే రంజాన్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మసీదులు కాంతులీనుతున్నాయి. ఉపవాస దీక్షలు ముగిసిన క్రమంలో సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, మైదానాల్లో ఏర్పాట్లు చేశారు.

–ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)



గుర్రపుడెక్క పూలు.. మైమరపించే హొయలు

నిండా గుర్రపుడెక్క పూలతో ఉండి మండలంలోని అర్తమూరు శివారు కవిటంపాకల ప్రాంతంలో ఖాళీ స్థలం ఆకట్టుకుంటోంది. దాదాపు ఐదెకరాల విస్తీర్ణంలో లేత వంకాయ రంగు పూలతో మైమరపింపజేస్తోంది. చుట్టూ ఆక్వా చెరువులతో నిండిన ఈ ప్రాంతంలో ఈ పూల 'డెక్క'రేషన్ అలరిస్తోంది.

- ఉండి

33వ గురు పట్టాభిషేక మహోత్సవం



బిషప్ జయరావును సన్మానిస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ జేవియర్ బోర్డింగ్ దేవాలయంలో ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర 33వ గురు పట్టాభిషేక వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని అమలోద్భవి కథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఐ.మైఖేల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బిషప్ జయరావు సందేశమిస్తూ ప్రతి గురువు ప్రజల కోసం జీవించాలని, క్రీస్తు ప్రభువు మాదిరి పేదలపై ప్రత్యేక ప్రేమ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఫాదర్ మైఖేల్ మాట్లాడుతూ బిషప్ జయరావు ఆదర్శ గురువుగా ప్రజలకు ఎనలేని సేవలను అందించారని కొనియాడారు.

వైభవం..ఉగాది సంబరం

● విశ్వావసు.. విజయ తేజస్సు ● ద్వారకాతిరుమలలో ఘనంగా వేడుక





ఉగాది మండపంలో వేడుక జరిపిస్తున్న అర్చకులు, వెండి శేషవాహనంపై తరలిన శ్రీవారు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రంలో ఉగాది ఉత్సవం అంబరాన్నంటింది. ఆదివారం స్థానిక ఉగాది మండపంలో వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఉభయదేవేరులతో శేషవాహనంపై కొలువైన శ్రీవారిని అట్టహాసంగా మండపం వద్దకు తీసుకువచ్చారు. మండపంలోని రజిత సింహాసనంపై ఉత్సవమూర్తులను వేంచేపు చేసి పూజాదికాలు నిర్వహించారు. పండితులు పంచాంగ శ్రవణాన్ని పఠించి రాశి ఫలాలను వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు అర్పించారు. చివరగా పండిత సత్కారాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి దంపతులు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఆగమ విద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పోటెత్తిన భక్తులు

కొత్త సంవత్సరాది కావడంతో చిన వెంకన్న క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, టికెట్, ప్రసాదాల కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి.

కళ్యాణమస్తు.. ఊసే లేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళ్యాణమస్తు.. షాదీతోఫా చెక్కు అందిస్తున్న నాటి కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

కూటమి ఎగనామం
- పేదింటి బిడ్డల పెళ్లిళ్లకు అందని సాయం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.50 లక్షల వరకు అందజేత
- ఐదు విడతల్లో 2,364 మందికి రూ.18.10 కోట్ల పంపిణీ
- కూటమి ప్రభుత్వంలో పథకం ఊసెత్తని వైనం

భీమవరం(ప్రకాశం చౌక్): పేదింటి ఆడ బిడ్డల వివాహాలకు ఆర్థికసాయం అందించాలనే సదుద్దేశంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాన్ని ప్రవేశపెట్టారు. పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ఓసీ కులాల్లోని భవన నిర్మాణ కార్మికుల పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా అందించి అండగా నిలిచారు. ఆయా వర్గాలను బట్టి రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరం సాయం అందించారు. ప్రతి మూడు నెలలకోసారి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాన్ని పక్కాగా అమలు చేశారు. ఇలా పేద తల్లిదండ్రులకు పిల్లల వివాహాలు భారం కాకుండా ఆదుకున్నారు. అయితే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ పథకం ఊసెత్తడం లేదు.

జిల్లాలో 10 వేల మంది వరకు లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమం కోసం కళ్యాణమస్తు పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. అయితే అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ పథకం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కూడా పెళ్లికానుక పథకానికి కేటాయింపులు లేవు. దీంతో ఈ పథకాన్ని కూటమి సర్కారు ఎత్తేసినట్టు పలువురు విమర్శిస్తున్నారు. గత 10 నెలల్లో జిల్లాలోని ఆయా వర్గాలకు చెందిన సుమారు 10 వేల మంది లబ్ధిదారులు కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

అప్పులతో సతమతం

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి వివాహాలు జరిపిస్తున్నారు. గత ప్రభుత్వంలో అందించిన సాయాన్ని గుర్తుచేసుకుంటూ కూటమి ప్రభుత్వం కూడా తప్పకుండా ఈ పథకాన్ని అమలు చేసి తమను ఆదుకోవాలని పేదలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో సాయం ఇలా..

ఎస్సీ, ఎస్టీలు	రూ.లక్ష
ఎస్సీ, ఎస్టీ కులాంతర వివాహం	రూ.1.20 లక్షలు
బీసీలు	రూ.50 వేలు
బీసీలు కులాంతర వివాహం	రూ.75 వేలు
మైనార్టీలు	రూ.లక్ష
దివ్యాంగులు	రూ.1.50 లక్షలు
భవన నిర్మాణ కార్మికుల పిల్లలు	రూ.40 వేలు

గత ప్రభుత్వంలో అందించిన సాయం

వర్గం	లబ్ధిదారులు	సాయం (రూ.లక్షల్లో)
ఎస్సీ జంటలు	615	615
ఎస్టీ జంటలు	15	15
బీసీ జంటలు	1,406	703
దివ్యాంగులు	34	51
మైనార్టీలు	31	31
బీసీ కులాంతర	136	120
ఎస్సీ కులాంతర	80	96
ఎస్టీ కులాంతర	3	3.60
భవన నిర్మాణ కార్మికులు	44	176
మొత్తం	2,364	1810.60

క్లుప్తంగా

కోడి పందేల స్థావరాలపై దాడులు

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్.జగన్నాథపురం, మలసానికుంట గ్రామాల్లో కోడి పందేల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేసి 19 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 49,200 నగదు, 4 కోడి పుంజులు, 5 కోడి కత్తులు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐఎస్ జగన్నాథపురంలో 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.15,800 నగదు, కోడి పుంజు, రెండు కోడి కత్తులు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. మలసానికుంటలో 11 మందిని అరెస్ట్ చేసి, రూ.33,400 నగదు, 3 కోడి పుంజులు, 3 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ముదినేపల్లి మండలంలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో కోడిపందేలు ఆడుతున్న 9 మందిని ఎస్సై వీరభద్రరావు ఆదివారం అరెస్టు చేశారు. గురజ పంటకాలువ దగ్గర కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.3050 నగదు రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. కొరగుంటపాలెంలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.4,200 నగదు కోడి పుంజు స్వాధీనం చేసుకున్నారు.

మృతదేహంతో బంధువుల ఆందోళన

కొట్టి చంపేశారు: కుటుంబసభ్యులు



వేల్పూరు సూర్య వైన్స్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

తణుకు అర్బన్: మద్యం దుకాణ ఆవరణలో ఈ నెల 29న వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనలో మృతుడు శ్రీనివాసరావు మృతదేహంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆదివారం వైన్ షాపు వద్ద ఆందోళన నిర్వహించారు. శ్రీనివాసరావును కొట్టి చంపేశారని, కాళ్లు, చేతులు వెనక్కి మడిచేసి దారుణంగా హింసించినట్లుగా ఒంటిపై ఉన్న గాయాలే చెబుతున్నాయని మృతుడి భార్య లక్ష్మి, కుమార్తెలు ఆరోపించారు. గత మూడు రోజులుగా వైన్ షాపు ఆవరణలోని సీసీ కెమేరాలు పనిచేయడంలేదని షాపు యజమానులు అంటున్నారని, ఇప్పుడు ఎందుకు పనిచేస్తున్నాయని వారు నిలదీశారు. విషయం తెలుసుకున్న బహుజన సంఘ నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ ఆందోళనకారులకు మద్దతు పలికారు. తక్షణమే బ్రాంది షాపు లైసెన్స్‌ను రద్దుచేయాలని, బాధిత కుటుంసభ్యులకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని అన్నారు. తణుకు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సైలు చంద్రశేఖర్, జానా సతీష్‌లు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఈ ఘటనపై రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పోస్టుమార్టం రిపోర్టు వస్తే కానీ తెలియదని, కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

ఎండలో జర భద్రం



పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అప్రమత్తం అంటున్న వైద్యులు

కాళ్ల: రోజురోజుకు పెరుగుతున్న ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సరాబు సునీల్ పలు జాగ్రత్తలు తెలియజేశారు. ఎండలో ఎక్కువగా తిరిగినా, నీరు తక్కువ తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టకపోవడం, కాళ్లు చేతుల నొప్పులు, తిమ్మిర్లు, వాంతులు, తలనొప్పి, స్పృహ కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఈ సమస్య రాకుండా ఉండాలంటే నీరు అధికంగా తీసుకోవాలి. నిమ్మరసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ పౌడర్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీటిని తాగాలి.

కంటి ఇన్ఫెక్షన్లు

వేసవిలో కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు ఒకటి. కళ్లకు తగినంత విశ్రాంతినివ్వాలి. క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కళ్లను కడగాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కళ్లజోడు వాడాలి. సమస్యలు వస్తే వైద్యుడిని సంప్రదించాలి.

అతిసారం

వేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనాలు సాధారణం. కలుషిత ఆహారం తినడం, కలుషిత నీరు తాగడం, మద్యపానం అలవాట్లు డయేరియాకు దారి తీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండడానికి నీటిని మరిగించిన తరువాత మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి.

చర్మవ్యాధులు

సూర్యుడి అతినీల లోహిత కిరణాల వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై దద్దుర్లు, స్వేద గ్రంధులు మూసుకుపోవడం వంటి సమస్యలు వస్తాయి. చెమట వల్ల మచ్చలు, దురద, మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండాలంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి ఉపయోగించాలి. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వేసుకోకూడదు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమటను పీల్చే కాటన్ దుస్తులు ధరించడం మేలు.

గవద బిళ్లలు

వేసవిలో వచ్చే వ్యాధుల్లో గవద బిళ్లలు ఒకటి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటు వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంధి వాపు, కండరాల నొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తలనొప్పి

అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతిస్పందించడం వల్ల కూడా వస్తుంది. డాక్టర్ సలహా మేరకు మందులు వాడితే నియంత్రణలో ఉంటుంది.



డాక్టర్ సరాబు సునీల్, కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు

నీరు ఎక్కువగా తీసుకోవాలి

ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి తరచు మంచినీరు, నిమ్మకాయ నీళ్లతో పాటు ఎక్కువగా మజ్జిగ తీసుకోవాలి. నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి. లేత రంగు, తేలికైన, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు. కూల్‌డ్రింక్స్ తాగకూడదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు



జంగారెడ్డిగూడెంలో చికిత్స పొందుతూ మృతి చెందిన పరశిన వీర నాగేశ్వరరావు(45)

జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన పరశిన వీర నాగేశ్వరరావు, భార్య రమణమ్మ, కుమార్తె జాహ్నవి దేవి, కుమారుడు షణ్ముఖ్ రెడ్డితో కలిసి రాజమండ్రిలోని రమణమ్మ పుట్టింటికి వెళ్తున్నారు. కొయ్యలగూడెం మండలం సీతంపేట సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి, అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. వీర నాగేశ్వరరావు(45)తో పాటు భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీర నాగేశ్వరరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య, ఇద్దరు పిల్లలు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు.

మట్టి ట్రాక్టర్ల స్పీడుకు వ్యక్తి మృతి



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌కుమార్

కై కలూరు: నిబంధనలకు విరుద్ధంగా వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో అతను చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. వివరాల్లోకి వెళితే కోరుకొల్లు గ్రామానికి చెందిన బుసనబోయిన సత్యనారాయణ(47) కలిదిండి నుంచి కోరుకొల్లు వెళ్తున్నాడు. సానారుద్రవరం వద్ద అక్రమ మైనింగ్ చేస్తున్న కాశీ విశ్వనాథం ట్రాక్టర్‌తో ఢీకొట్టి ఆపకుండా వెళ్లాడు. బంధువులు అతన్ని భీమవరం , అక్కడ నుంచి విజయవాడ ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మరణించాడు. మృతదేహన్ని కైకలూరు ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశాడు. అక్రమ మైనింగ్ చేస్తూ ట్రాక్టర్‌తో ఢీకొట్టడమే కాకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం వల్లే సత్యనారాయణ మృతి చెందాడని, న్యాయం చేయాలని కైకలూరు ఆస్పత్రి ఎదురుగా పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిపై బంధువులు ధర్నా చేశారు. టౌన్ ఎస్సై డి.వెంకట్‌కుమార్ వారితో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. ట్రాక్టర్ డ్రైవర్ నుంచి నష్టపరిహారం బంధువులకు అందినట్లు సమాచారం. కలిదిండి ఎస్ఐను వివరణ కోరగా కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

పాస్టర్ మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలి

అత్తిలి: క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని క్రైస్తవ మత పెద్దలు అన్నారు. అత్తిలి మండల క్రైస్తవులు ఆదివారం అత్తిలిలో ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ర్యాలీ నిర్వహించారు. అత్తిలి బస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధులుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు వినతి పత్రం అందజేశారు. యూపీఎం ప్రెసిడెంట్ బాబూరావు ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీని ఉద్దేశించి బిషప్ ప్రేమ్‌కుమార్, బిషప్ జగజ్జీవన్, ఎన్‌సీసీ స్టేట్ సెక్రటరీ మనోజ్‌బాబు, ఎంఆర్‌పీఎస్ అబ్బు దాసరి లాజరస్ మాట్లాడారు.

భీమవరంలో..

భీమవరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పట్ల సంతాపాన్ని తెలియచేస్తూ శత వార్షిక రూపాంతర దేవాలయం సంఘ సభ్యులు ఆదివారం శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. సత్వరం దర్యాప్తు చేసి.. ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సభ్యులు కోరారు. పీసీసీ చైర్మన్ ఉన్నమట్ల కరుణాకరరావు, రేమల్లి కమలరాజు, సంఘస్తులు పాల్గొన్నారు. అదే విధంగా పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ స్థానిక లూథరన్ గ్రౌండ్ నుంచి ప్రకాశంచౌక్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం దర్యాప్తును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. గంటా సుందర్‌కుమార్, చిగురుపాటి సందీప్, పిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మండవల్లిలో మండల క్రైస్తవ సంఘాలు, విశ్వాసుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కమ్యూనిటీ హాలు నుంచి మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ చేశారు.



అత్తిలిలో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



మండవల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ విశ్వాసులు



ఆకివీడులో శాంతి ర్యాలీ



నరసాపురం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన

ఆకివీడులో..

ఆకివీడు: పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానస్పద మృతికి నిరసనగా ఆదివారం ఆకివీడులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీబీసీఎన్‌సీ సెంట్రల్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి గూడపాటి జోసఫ్ రాజు మాట్లాడుతూ పాస్టర్లపై దౌర్జన్యాలు, తొలుత ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాల్వేషన్ ఆర్మీ డీసీ మేజర్ మణిబాబు, సీఎస్ఐ ప్యారీస్ గురువు ఎ.సతీష్, సీయోన్ శిఖరం పాస్టర్ గుర్రం పరంజ్యోతి, సీయోను మందిరం మేజర్ పాస్టర్ తిమోతి తదితరులు పాల్గొన్నారు. హత్యల్ని ఖండించాలన్నారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉంటున్న పాస్టర్లపై దాడులు హేయమైన చర్య అన్నారు. స్థానిక సీబీసీఎస్ చర్చి నుంచి ప్రధాన సెంటరులోని అంబేడ్కర్ సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ జార్జి, మండా ఏసోబు, బొండాడ వెంకటేశ్వరరావు, నాని, మద్దా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిజానిజాలు నిగ్గుతేల్చాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యేనని, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ఆదివారం నరసాపురంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ వై.రూబెన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో జిల్లా నలుమూలలు నుంచి వేల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత క్రైస్తవులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు చదలవాడ జ్ఞానప్రకాష్, కాకిలేటి మధు, అడిదల శరత్, సికిలే పెర్సిపాల్, ఇంజేటి జాన్‌కెనడీ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో కొలువైన మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వారణాసి సేతు మాధవలక్ష్మీ నరసింహమూర్తి విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ మాట్లాడుతూ విశ్వావసు ఉగాది శుభ సంవత్సరం కావాలని కోరుతూ అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అమ్మవారికి పూజ చేసి పసుపు కొమ్ములు, ఒక నాణెం అందజేసినట్లు తెలిపారు. దేవస్థానం తరపున జ్యోతిష్య వేత్త బ్రహ్మశ్రీ ర్యాలీ కృష్ణ ప్రసాద్ సిద్ధాంతిని సత్కరించినట్లు తెలిపారు. గునుపూడిలో పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.



మావుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో అష్టావధానం

త్యాగానికి ప్రతీక రంజాన్

నేడు పండుగ జరుపుకోనున్న ముస్లింలు

చింతలపూడి: నెల రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగ సోమవారం జరుపుకోనున్నారు. ఆదివారం నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉపవాసాలను నమాజుతో విరమించారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసే ముందు పేదలకు సాయం చేస్తారు. ఈదుల్ ఫితర్ నమాజ్‌ను పురస్కరించుకుని పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి ఈద్గాహ్, మసీదులకు వెళ్లి సామూహికంగా ప్రార్థనలు చేస్తారు. నమాజు అయిన తరువాత ముస్లింల స్మశాన వాటిక(ఖబరస్తాన్)కు వెళ్లి పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తారు. అనంతరం కుటుంబంలోని పెద్దలను కలిసి శుభాకాంక్షలు తెలియచేసి వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. నమాజు ముగిశాక బంధుమిత్రులు, స్నేహితులను ఆహ్వానించి సేమియా పాయసం, షీర్ ఖుర్మా తినిపిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రం పసందైన వంటకాలతో స్నేహితులను, బంధు మిత్రులను పిలిచి ఆప్యాయంగా పెడతారు.



రంజాన్ ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

దివ్య ఖురాన్ అవతరించిన నెల

ఖురాన్ అవతరించింది రంజాన్ మాసంలోనే.. అల్లాహ్ నుంచి 1,24,000 మంది ప్రవక్తలు రాగా వారిలో మహమ్మద్ ప్రవక్త చివరి వారు. క్రీ.శ.624 మార్చి 27న తన సహచరులతో కలిసి మదీనాలో ఈదుల్ ఫితర్ పాటించారని ప్రతీతి. సాధారణ రోజుల్లో ఎవరికైనా దానం చేస్తే దానిని స్వీకరించిన వ్యక్తి మాత్రమే లెక్కలోకి వస్తాడని, రంజాన్ మాసంలో ఒక వ్యక్తికి దానం చేస్తే వందమందికి చేసినంత ఫలితం ఉంటుందని భావిస్తారు. ఈ నెలలో చేసే దానాలు నేరుగా దైవ సన్నిధికి చేరతాయని నమ్మకం.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ వెన్నవల్లి వారిపేట ప్రాంతంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి హత్య, దోపిడీ కేసును ఏలూరు వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు వివరాలు వెల్లడించారు. చనపతి రమణమ్మ అలియాస్ చిట్ల రమణమ్మ (65) ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. భర్త చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తూ చీటి పాటలు వేస్తూ ఉంటుంది. ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈనెల 27న వ్యక్తి ఆమెను దారుణంగా హత్య చేశారు. ఆధారాలు లభించకుండా పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. మెడలోని బంగారు ఆభరణాలతో పరారయ్యారు. వన్‌టౌన్ సత్యనారాయణ పేట కమ్యూనిటీ హాలు ప్రాంతంలో ఉంటున్న చనపతి దుర్గాప్రసాద్ రమణమ్మ వద్ద చీటి పాటలు వేశాడు. చీటీ పాడుకుని సుమారు రూ.2 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. డబ్బుల కోసం రమణమ్మ అనేకసార్లు దుర్గాప్రసాద్‌ను మందలించింది. దుర్గాప్రసాద్ తన ఉంగరాన్ని తాకట్టుపెట్టి మరో రూ.30 వేల వరకు అప్పు తీసుకున్నాడు. ఈ నెల 27న సాయంత్రం డబ్బులు విషయం మాట్లాడేందుకు రమణమ్మ వద్దకు వెళ్లాడు. రమణమ్మ తిట్టడంతో ఒక్కసారిగా రమణమ్మపై దాడి చేశాడు. నైలాన్ తాడు మెడకు బిగించి హత్య చేశాడు. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నాడు. అనంతరం కాళ్ళు, చేతులు కట్టేసి ఆధారాలు లభించకుండా పెట్రోల్ పోసి నిప్పుపెట్టి పరారయ్యాడు. ఇంట్లో నుంచి దట్టమైన పొగ రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుర్గాప్రసాద్‌ను ఈనెల 30 న ఏలూరు నగరంలోని పంపుల చెరువు రోడ్డులో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి నుంచి సుమారు 57 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1000 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ అభినందించారు.

మన్యంలో ఘనంగా మామిడికాయ పండుగ



వనదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం



చిన్నారుల గిరిజన నృత్యాలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఉగాది పండుగ పర్వదినంతో ప్రారంభమయ్యే మామిడికాయ పండుగను ఆదివారం పలు గిరిజన గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వేసవిలో మామిడికాయ పండుగ అత్యంత ముఖ్యమైనది. ఈ పండుగ జరిపిన తర్వాత మాత్రమే గిరిజనులు మామిడికాయను తింటారు. ఉగాది రోజున ఇళ్లలో, గ్రామాల్లో ,తోటల్లో కాసిన మామిడి కాయలను అందరూ పండగకు కోసుకొని తీసుకొచ్చి అక్కడ పూజల అనంతరం తింటారు. ప్రతి గ్రామంలో గంగానమ్మతో పాటు ఆయా గ్రామాల్లోని వన దేవతలను గిరిజనులు పూజిస్తారు. ఆయా దేవతలకు దూప దీప నైవేద్యాలతో ఘనంగా పూజలు చేసిన తర్వాతే మామిడి కాయలు చెట్ల నుంచి కాయలను కోస్తారు. ప్రతి ఇంటికీ కోడిని తీసుకువచ్చి గ్రామ దేవతకు మొక్కుగా ఇస్తారు. గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉంటే అన్ని కోళ్లు మొక్కుగా ఇస్తారు. ఆ కోళ్లను వండుకుని సహపంక్తి భోజనాలు చేస్తారు. మామిడికాయ పండుగలో దేవతలకు పూజలనంతరం గ్రామంలోని చిన్నాపెద్దా కలిసి ఒక గుజిడీ (స్థలం) ఏర్పాటు చేసుకుంటారు. అక్కడికి కోడి కూర తెచ్చుకుని లొట్లలో తాటి కల్లు ఏర్పాటు చేసుకుని జీడి, మామిడి ఆకులతో, దారకాయలతో తాటికల్లును సేవిస్తారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

మామడి కాయ పండుగను పురస్కరించుకుని గ్రామంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా గిరిజన సంప్రదాయ రేల నృత్యాలు చేస్తారు. ఈ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆదివారం కంసాలి కుంటలో ఈ ప్రారంభమైన ఈ మామిడికాయ పండుగలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ పాల్గొని వన దేవతలకు పూజలు చేయడంతో పాటు మహిళలతో కలిసి గిరిజన నృత్యాలు చేశారు.

క్లుప్తంగా

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుపై నిరసన



నిరసన చేస్తున్న ముస్లింలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు ఆదివారం నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెం మసీద్ హనఫియా జమాత్ ఆధ్వర్యంలో ఆదివారం నమాజ్ అనంతరం పెద్ద మసీద్ వద్ద ముస్లిం పెద్దలు, యువకులు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్లోగన్లు ఇచ్చారు. కార్యక్రమంలో జమాతే సంఘ సభ్యులు, ముస్లిం పెద్దలు అబ్దుల్ ఘనీ, ఎండీ షాజహాన్, సర్దార్‌ఖాన్, ఎస్కే నౌషాద్, మోహిద్, షకీల్, షాజహాన్, దస్తగిరి, షఫీ, షరీఫ్, నజీర్, రహూల్లా, తదితర యువకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన ఎక్సైజ్ సీఐ

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి తీవ్రత దృష్ట్యా పట్టణంలో చలి వేంద్రాల ఆవశ్యకత ఎక్కువగా ఉందని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. టూటౌన్‌లో శ్రీనివాస ఏజెన్సీస్ వారిచే ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. ఏజెన్సీ నిర్వాహకులు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా పుంతలో ముసలమ్మ జాతర



అమ్మవారి జాతర మహోత్సవంలో భక్తుల సందడి

తణుకు అర్బన్: శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం తణుకులో కన్నులపండువగా నిర్వహించారు. స్థానిక కుమ్మర్ల వీధిలో వేంచేసియున్న ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి జాతర మహోత్సవంలో గరగల నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణాసంచా కాల్పులతో తణుకు ప్రాంతంలో ఊరేగింపు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు ఆకుల బ్రదర్స్, మారోతి బ్రదర్స్, దూడల శ్రీను, చేసెట్ల శంకర్, బెజవాడ సూరి, చిక్కాల మోహన్, గరిమెళ్ల పవన్, గాదంశెట్టి జయకృష్ణ జాతర మహోత్సవాన్ని పర్యవేక్షించారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అత్తిలి: ఉగాది పర్వదినం సందర్భంగా అత్తిలి గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవాలలో భాగంగా భక్తులు నవ ధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతి నారాయణరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా అత్తిలి శ్రీసోమాలమ్మ, దుర్గమ్మ తాళ్ల వద్ద భక్తులు పూజలు చేశారు.

సీతారాములకు వెండి కిరీటాల సమర్పణ



వెండి కిరీటాలను అందజేస్తున్న తాడి పాండురంగారావు, సూర్యకుమారి దంపతులు

పెంటపాడు: మండలంలలోని యానాలపల్లి గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన దంపతులు రూ.1.50 లక్షల విలువైన 4 వెండి కిరీటాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామంలోని రామాలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంతులకు నాలుగు వెండి కిరీటాలు అందించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. తాడి శ్రీను, తాడి లోకేంద్రతేజ్, దాసం తాతాజీ, కవల మూర్తిరాజు, తాడి సత్తిపండు, పండు, వీరాబత్తుల సత్యనారాయణ, గణేశుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో నీటి ఎద్దడి తప్పదా?

- శివారు ప్రాంతాలకు నీరు అందడం కష్టమంటున్న ప్రజలు
- 45 రోజులు కాలువల కట్టివేత
- ట్యాంకర్లతో నీటి సరఫరా



గూడెం పట్టణంలోని పంపుల చెరువు

తాడేపల్లిగూడెం: వేసవి ముందే వచ్చినట్టుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ సీజన్‌లో కాలువలు కూడా అదనంగా 20 రోజులు కట్టేస్తారు. సాధారణంగా ప్రతి ఏడాది 25 రోజులు కాలువలు కట్టేస్తే, ఈ సారి కాలువల్లో పూడిక తీయడానికి గాను అదనంగా మరో 20 రోజులు కట్టేయనున్నారు. దీంతో పట్టణాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు వెదకకపోతే, శివారు ప్రాంతాలకు నీరు అందే అవకాశాలు తక్కువ. గూడెం పట్టణంలో ఈ వేసవి సీజన్‌లో శివారు ప్రాంతాలకు నీటి కొరత వచ్చే అవకాశాలు ఉన్నాయి. పట్టణంలో ఉన్న ప్రజలకు కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలంటే ఇబ్బంది కలుగుతుంది. పట్టణం మొత్తానికి నీటిని సరఫరా చేయడానికి ఒకే ఒక పంపుల చెరువు ఉంది. ఈ చెరువు నీటి మట్టం 546 మిలియన్ లీటర్ల సామర్థ్యం. పట్టణ ప్రజల మొత్తానికి 25 రోజులకు సరిపడా నీరు అందించొచ్చు. వేసవిలో కాలువలు కట్టిన సమయంలో గోదావరి ఏలూరు కెనాల్‌కు జువ్వలపాలెం వద్ద క్రాస్‌బండ్ వేస్తారు. దీని వలన అదనంగా మరో ఐదు రోజుల పాటు నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయొచ్చు. కాని ఈ వేసవిలో కాలువలను 45 రోజుల పాటు కట్టేయనున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలకు నీరు అందే అవకాశాలు తక్కువ.

పట్టణంలో 15554 కుళాయిలు

పట్టణంలో 27192 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 15554 కుళాయిలు ఉన్నాయి. వాటర్ డిమాండ్ ప్రతి కనెక్షన్‌కు 14.85 ఎంఎల్‌డీ సరఫరా చేయాలి. ప్రస్తుతానికి ఒక్కో కనెక్షన్‌కు 11.15 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ఉదయం, సాయంత్రం కలిపి రెండు గంటలు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే నీటి జలాశయ సామర్థ్యం 556 మిలియన్ లీటర్లు. ఈ నీటిని 143.47 కిలోమీటర్ల పొడవున్న కుళాయి లైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. లక్షా పది వేలకు పైగా ఉన్న పట్టణ జనాభాకు వేసవిలో కాకుండా, సాధారణ రోజుల్లో శివారు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే పరిస్థితులు లేక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సారి మంచినీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు 20కి పైగా శివారు ప్రాంతాలకు నీటిని అందించే అవకాశాలు లేవు. చెరువు నీటి సామర్థ్యం 25 రోజుల సరఫరాకు సరిపోతుంది. క్రాస్‌బండ్ వేస్తే మరో ఐదు రోజులు గెంటొచ్చు. తరువాత పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీంతో ఈ వేసవిలో శివారు ప్రాంతాలలో దాహం కేకలు వినపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాళ్లముదునూరుపాడు, రాళ్ల సాహెబ్ వీధి, కడకట్ల, జువ్వలపాలెం, హౌసింగ్ బోర్డు కాలనీ వంటి ప్రాంతాలకు, రామారావుపేటలోని కొన్ని ఏరియాల్లో నీటి కొరత ఉంది. దీన్ని వేసవిలో ఎలా అధిగమిస్తారో చూడాలి.

> **నీటి కొరత రానివ్వం**
>
> వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ రూపొందించాం. శివారు ప్రాంతాలకు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం, కాలువలు కట్టేసిన తర్వాత కాలువకు క్రాస్‌బండ్ వేస్తున్నాం. ప్రస్తుతం మునిసిపాలిటీకి ఆరు ట్యాంకర్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరో పది ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నాం. వేసవి జలాశయంలోకి నీటిని మళ్లించడానికి అవసరమైన ప్రాంతాల్లో బోర్లను ఏర్పాటు చేసి, నీటిని చెరువులోకి పంపి ఫిల్టర్ తర్వాత కుళాయిల ద్వారా విడుదల చేస్తాం. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. గత అనుభవాల నేపథ్యంలో మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి ఇబ్బంది రాదు. – వెంకటరమణ, మున్సిపల్ ఇంజనీర్, తాడేపల్లిగూడెం

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు



బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దివ్య మంగళ రూప దర్శనం భక్తులకు కల్పించారు. తొలుత అమ్మవారి ఆలయాన్ని, అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులచే విశేష పూజలు నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు. భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అమ్మవార్ల ఆలయాల్లో 'ఉగాది' పూజలు







దండు మారెమ్మ, గంగాదేవి, జాలారి గంగమ్మ అమ్మవార్లు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు వారి కొత్త సంవత్సరం కావడంతో ఉదయం నుంచి భక్తులు అమ్మవార్ల ఆలయాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ముత్యాలమ్మ దేవస్థానం, దండగర్ర, మోదుగగుంట, అప్పారావుపేట, పుల్లాయగూడెం, జగన్నాథపురం, ఆరుగొలను, రామన్నగూడెం, కుంచనపల్లి తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కాగా, మాధవరం పోలేరమ్మ వారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్‌లు దర్శించుకున్నారు. మోదుగ గుంట మార్లమ్మ వారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు విరివిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మాధవరంలోని దండు మారెమ్మ, రణగంగ, తుడుపులమ్మ, మారెమ్మ, పోతురాజు స్వామివార్ల ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ వన్నెంరెడ్డి గంగాధరరావు, కమిటి సభ్యులు నారాయణ, సూరిశెట్టి గణపతి, ప్రత్తి నాగేశ్వరరావు, గంధం రామకృష్ణ, పుప్పాల శ్రీను, గ్రామ ఉప సర్పంచ్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మోదుగ గుంట మార్లమ్మ ఆలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



మాధవరంలో కొలువైన పోలేరమ్మ, మహంకాళమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లు

పలువురికి ఉగాది పురస్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా స్థాయి ఉగాది పురస్కారం భీమవరం విష్ణు కళాశాల ఆవరణలో ఆదివారం తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అందుకున్నారు. ఐదున్నర దశాబ్దాలుగా వెంకట రమణ కళారంగానికి చేస్తున్న సేవలు నిమిత్తం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఈ పురస్కారం అందజేశారు.

ఎస్.ఖాసింకు పురస్కారం అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాస్థాయి ఉగాది పురస్కారంను ప్రముఖ గాయకులు ఘంటసాల గానసభ అధ్యక్షుడు ఎస్.కాసిం కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. 52 సంవత్సరాలుగా ఆర్కెస్ట్రా రంగంలో గాయకుడిగా కళా రంగానికి చేస్తున్న సేవలకుగాను పురస్కారం అందజేశారు.

జగదీష్‌కు పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ గాయకుడు పట్టణానికి చెందిన ఏలూరి జగదీష్ ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆర్కెస్ట్రాద్వారా అనేక పాటలు పాడుతూ ప్రజా మన్ననలను అందుకోవడంతో ఆయనకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా పురస్కారంను అందజేశారు.



ఉగాది పురస్కారాల్లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

కోపల్లె శ్రీనివాస్‌కు పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా స్థాయి ఉగాది పురస్కారం భీమవరం విష్ణు కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించగా కళాకారుడు, నటుడు, 134 రకాలు ఏకపాత్ర అభినయాలు సుమారు 5 వేల ప్రదర్శనలు చేసిన డాక్టర్ కోపల్లె శ్రీనివాస్ అందుకున్నారు. కళారంగానికి చేస్తున్న సేవలు నిమిత్తం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఈ పురస్కారం అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి శాంతి ర్యాలీలు



తణుకు అర్బన్: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

తణుకు అర్బన్: రాజమండ్రిలో అనుమానాస్పదంగా మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఆదివారం తణుకులో శాంతిర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ తణుకు పట్టణ యువత ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ పార్కు నుంచి మున్సిపల్ కార్యాలయం, నరేంద్ర సెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించి వాస్తవాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అసభ్య పదజాలంతో దూషిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు శాంతి ర్యాలీ..

ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నివాళులర్పిస్తూ ఈనెల 1వ తేదీన పాస్టర్స్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో తణుకులో భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ పగడాలకు నివాళులర్పిస్తూ సాయంత్రం ఐదు గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి నరేంద్ర సెంటర్ వరకు సాయంత్రంశాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని, తణుకు నియోజకవర్గంలో ఉన్న సేవకులు, విశ్వాసులు, నాయకులు తరలి రావలసిందిగా కోరారు.



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

జగన్నాథపురంలో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం సాయంత్రం క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, విశ్వాసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

తణుకులో చిత్ర యూనిట్ సందడి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

తణుకు అర్బన్: తెలుగు సాహిత్యంతో ప్రేక్షకులకు కనువిందు చేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో వినూత్నంగా ప్రయోగం చేసి విజయం సాధించిన చిత్రం కాలమేగా కరిగింది అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాలమేగా కరిగింది చిత్రం యూనిట్ ఆదివారం తణుకులో సందడి చేసింది. విడుదలైన చిత్రం ప్రేక్షకులతో కలిసి చూసేందుకు సినీ యూనిట్ శ్రీచిత్ర థియేటర్‌కు విచ్చేశారు. వర్ధమాన దర్శకుడు సింగార మోహన్ దర్శకత్వంలో వినయ్‌కుమార్, శ్రావణి మజ్జిన్, అరవింద్ ముదిగొండ, నోమిన తార హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన ఈ చిత్రానికి మారే శివశంకర్ నిర్మాతగా వ్యవహరించారు. ఆదివారం చిత్ర తారాగణం వినయ్‌కుమార్, అరవింద్ ముదిగొండతోపాటు దర్శకుడు సింగార మోహన్, డిస్ట్రిబ్యూటర్ గొల్ల ప్రసాద్ థియేటర్‌కు వచ్చారు. యూనిట్ సభ్యులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో పంచాంగ శ్రవణం



పండిత సత్కారంలో పాల్గొన్న వాసవీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, వేదపండితులు ఆశీర్వచనాలు జరిగాయి. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఇరగవరం పీసపాటి పాల శంకర వర ప్రసాద్‌కు పండిత సత్కారం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లేపర రాము, కార్యదర్శి సుందరరావు, కోశాధికారి రమేష్, వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శిల్పి ఉడయార్‌కు ఉగాది పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ప్రభుత్వం రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కారం–2025ను తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఎం.శ్రీనివాస్ శిల్పి ఉడయార్ అందుకున్నారు. ఈ సందర్భంగా శిల్పి ఉడయార్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస శిల్పిని పలువురు అభినందించారు.

ఘనంగా ఉగాది సంబరాలు

- పలు గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు
- వైభవంగా ఊరేగింపు కార్యక్రమాలు

పెంటపాడు: ఉగాది పర్వదినం పురస్కరించుకొని పెంటపాడు మండలంలో పలు గ్రామాలలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు వైజంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో సాయంత్రం భజన నిర్వహించారు. కె.పెంటపాడు బైరాగిమఠంలోని వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఉగాది పురస్కరించుకొని దేవేరులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణం వినిపించారు. అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్ర త్రిపాఠి గోపూజలు, ప్రత్యేక పూజలు చేయించారు. ప్రత్తిపాడు కాగులంపాడు వద్ద సరస్వతి విద్యాలయ ఎదురుగా ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రైస్‌మిల్లర్ కొలనువాడ పెదకృష్ణంరాజు పాల్గొన్నారు. పడమరవిప్పర్రు గ్రామంలో మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ ఉత్సవాలు పురస్కరించుకొని అమ్మవార్లకు కావిడి ఉత్సవం నిర్వహించారు. రావిపాడు కనకదుర్గమ్మ, బెండల్లంక ముళ్లమ్మ అమ్మవారు ప్రత్తిపాడు కాగులంపాడులో రోడ్డులో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి విశ్వావసు నామ సంవత్సరం పురస్కరించుకుని గ్రామస్తులు, భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్ పూజలందుకుంటున్న దుర్గమ్మ



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది సంబరాల్లో పాల్గొన్న ప్రముఖులు

వాకర్స్ ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాకర్స్ భవనంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమళ్ళ సూరిబాబు అధ్యక్షతన శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలును ఘనంగా నిర్వహించారు. వాకర్స్ సాంప్రదాయ దస్తులలో ఉగాది వేడుకలు జరిపారు. ఉగాది పచ్చడిని అందించారు. డాక్టర్ కంచర్ల, కోశాధికారి మల్లారెడ్డి సారధి, ప్రవా శ్రీనివాస్, బాకా వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసరావు, వనచర్ల నాగేంద్ర, నూకరాజు, కప్పల నరసింహామూర్తి, దూలం నాగరాజు, కేవీ చలం, గ్రంధి సత్యనారాయణ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా పరిషత్తు కార్యాలయంలో స్థానిక బ్రాహ్మణ సేవా పరిషత్తు గాయత్రి కళ్యాణ మండపంలో అధ్యక్షులు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన వెలవలపల్లి బాల సుబ్రహ్మణ్యం శర్మచే పంచాంగ శ్రవణం గావించారు. కోశాధికారి ప్రవావవాస్, ఎస్‌బీఐ బజార్ మేనేజర్ జవహర్, కొలచన మహతి, కలిగొట్ల శ్రీనివాస్, రౌతుల రాజా, కనకదుర్గ, న్యాయవాది కుసుమ, లలిత తదితరులు పాల్గొన్నారు. వేమూరి లక్ష్మీనారాయణచే 15 మంది బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, నగదు అందజేశారు.